బోనం.. ఘనం



సచివాలయంలో బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. మహిళా ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కళాకారులు, చిన్నారుల నృత్యాలు, విన్యాసాలు అలరించాయి. సీఎస్ శాంతికుమారి నల్ల పోచమ్మకు బోనం సమర్పించారు.



బోనాల జాతరకు సర్వం సిద్ధం

పూర్తయిన విద్యుత్ దీపాల అలంకరణ ● ఏర్పాట్లు సిద్ధం చేసిన ఆలయ కమిటీలు



గోల్నాక నల్లపోచమ్మ అమ్మవారు

గోల్నాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీన జరగనున్న ఆషాఢ బోనాల జాతరకు ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే ఆయా ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకొని భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. గోల్నాక శ్రీలక్ష్మీనగర్‌లోని శ్రీదేవి నల్లపోచమ్మ దేవాలయాన్ని ఇప్పటికే ముస్తాబు చేశారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఆలయ కమిటీ పక్షాన బోనం సమర్పిస్తారని కమిటీ ప్రధాన కార్యదర్శి కొమ్మిడి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అలాగే తొట్టెల, ఫలహారం బండ్ల ఊరేగింపులు ఆలయానికి తరలి వస్తాయని ఆయన తెలిపారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ కార్పొరేటర్లు ఆలయాన్ని సందర్శించనున్నారని ఆయన తెలిపారు.

గంగానగర్ మైసమ్మ ఆలయంలో..

బోనాల ఉత్సవాలను పునస్కరించుకున్నిగంగానగర్‌లోని శ్రీమహంకాళి, శ్రీబంగారుమైసమ్మ దేవాలయాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. బస్తీ కమిటీ సభ్యులు ఆర్.కె. బాబు, కె.రాంచందర్, సింగీతం రాజేష్, శేఖర్, పరుశురాం, లక్ష్మీనారాయణ, కె.చందు తదితరులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

రేపు శాకంబరీ అలంకరణలో దర్శనం

ముషీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ మహంకాళి దేవాలయ బోనాలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ, ఈవో జి. సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు వై.చంద్ర మౌళి తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అమ్మవారిని శుక్రవారం శాకంబరీ అలంకరణలో ముస్తాబు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఈ నెల 28న అఖండ దీపారాధన, చండీహోమం, కుంకుమార్చన, ఫలాహార బండ్ల ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 29వ తేదీన మధ్యాహ్నం ఒంటిగంటకు స్వర్ణలతచేత రంగం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం అమ్మవారి ఘటం వీడ్కోలు, బలిగంప పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ మహంకాళీ దేవాలయం

నేడు బంగారు మైసమ్మ కల్యాణం

భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్ బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్ కుమార్ గురువారం తెలిపారు. కల్యాణానికి బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, కార్పొరేటర్లు సుప్రియా నవీన్ గౌడ్, రవిచారి, పావని వినయ్ కుమార్, రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు.



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బాకారం శ్రీపోచమ్మ ఆలయంలో..

రాంనగర్, ఆంధ్రజ్యోతి: బాకారం శ్రీపోచమ్మ ఆలయంలో ఉత్సవాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను జీహెచ్ఎంసీ సిబ్బందితో గురువారం రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి తొలగింపజేశారు.

బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్‌కు ఆహ్వానం

అంబర్‌పేట శ్రీమహంకాళి బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి దంపతులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు వై. శంకర్‌గౌడ్, సభ్యులు సుధాకర్, కిషోర్ వారికి ఆహ్వానపత్రం అందజేశారు. అలాగే బతుకమ్మ కుంట మైసమ్మ దేవాలయంలో జరిగే బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌కు ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల శివకుమార్, సభ్యులు గౌరీశంకర్, సందీప్ ఆహ్వాన పత్రం అందజేశారు.



కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి ఆహ్వానం అందిస్తున్న కమిటీ సభ్యులు

రాష్ట్రపతి నిలయానికి పర్యాటక సంస్థ ఉచిత బస్సు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి శీతాకాల విడిది అయిన బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం సందర్శకుల కోసం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా ఉచిత షటిల్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. ఈ బస్సులను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. బేగంపేట యాత్రినివాస్ టూరిజం బుకింగ్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. యాత్రినివాస్, ప్యారడైజ్ మెట్రోస్టేషన్ నుంచి ప్రతిరోజూ ఉ.9 గంటల నుంచి సా.4 గంటల వరకు ప్రతి గంటకో బస్సు బయలుదేరుతుందని పర్యాటక సంస్థ అధికారులు తెలిపారు. వారాంతపు సెలవు రోజుల్లో అదనంగా సా.5గంటలకు, 6గంటలకు అదనంగా రెండు బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు..

నేటితో ముగియనున్న నిందితుల రిమాండ్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన నలుగురు నిందితులు.. మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు జ్యుడీషియల్ రిమాండ్ నేటితో ముగియనుంది. చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీలుగా ఉన్న వీరిని శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరచనున్నారు. అయితే, ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, శ్రవణ్ విదేశాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కోర్టుకు ఏ ఆధారాలను/వివరాలను సమర్పిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

నేడు ఫైర్‌మన్ల పాసింగ్ అవుట్ పరేడ్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న 483 మంది ఫైర్‌మన్ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం వట్టినాగులపల్లిలోని తెలంగాణ విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ శిక్షణ కేంద్రంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం అగ్నిమాపక శాఖలో ఇటీవల ఎంపికైన 157 మంది డ్రైవర్ ఆపరేటర్లకు నియామక పత్రాలు అందజేస్తారు.

'పార్కుల రక్షణ, పచ్చదనం ప్రభుత్వ బాధ్యత'

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల కోసం పార్కులను రక్షించడం.. పచ్చదనం పెంపొందించడం ప్రభుత్వం, స్థానిక సంస్థల బాధ్యత అని హైకోర్టు స్పష్టం చేసింది. పార్కులను రక్షించడంతోపాటు ప్రజల హక్కులను కాపాడేలా గ్రీన్ స్పేస్ ఏర్పాటు చేయాలని కోరుతూ కే ప్రతాప్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్ దాఖలై ఎనిమిదేళ్లు అవుతున్నా అధికారులు ఎలాంటి వివరాలు సమర్పించలేదని గుర్తు చేసింది. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నామో కౌంటర్ దాఖలు చేస్తామని ఏజీ తెలపడంతో విచారణ ఆగస్టు 1కి వాయిదా పడింది.

ప్రతి నాలుగు జంటల్లో ఒకరికి సంతానలేమి

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి నాలుగు జంటల్లో ఒకరు సంతానలేమి సమస్య ఎదుర్కొంటున్నారని ఇన్‌ఫెర్టిలిటీ నిపుణులు వెల్లడించారు. ఈ సంఖ్య దాదాపు 1.5-2 కోట్ల మేర ఉండగా, తెలంగాణలో 15 శాతం జనాభా ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వివరించారు. వరల్డ్ ఐవీఎఫ్ డే సందర్భంగా గురువారం కింగ్‌కోఠి కామినేని ఫెర్టిలిటీ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వైద్యులు, సిబ్బందితోపాటు గతంలో ఐవీఎఫ్ విధానం ద్వారా పిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, వారి పిల్లలు కూడా పాల్గొన్నారు. సంతానసాఫల్య చికిత్సకు వెళ్లడాన్ని ఇప్పటికీ సమాజంలో అదేదో తప్పుగా భావిస్తున్నారని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు.

ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, అపరిశుభ్రత

● పార్ట్‌టైం మంత్రి పర్యవేక్షణ ఏది? ● ఎక్స్‌లో కేటీఆర్



హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరం సీజనల్ వ్యాధులకు నిలయంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 'పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. వెయ్యి స్వచ్ఛ ట్రాలీలు కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో మేయర్, జీహెచ్ఎంసీ అధికారుల ఆకస్మిక పర్యటనలు చేయడం లేదు. చెత్త తరలింపు కాగితాలకే పరిమితమైంది. పర్యవేక్షించాల్సిన పార్ట్‌టైం మునిసిపల్ మంత్రి ఎమ్మెల్యేల కొనుగోలు, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారు' అని పరోక్షంగా సీఎం రేవంత్‌నుద్దేశించి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తన ఎక్స్ ఖాతాలో పలు విమర్శలు చేశారు.

రూ. 345.84 కోట్లు

మూడు కమిషనరేట్లకు బడ్జెట్ కేటాయింపులు

(5వ పేజీ తరువాయి)

ఈ బడ్జెట్‌లో కేటాయించారు.

- సాంకేతిక అవసరాలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు రూ. 18.45 కోట్లు
- సీసీఎస్ నిర్వహణకు రూ. 95 లక్షలు
- నేర పరిశోధన, క్రైమ్ డేటా విశ్లేషణకు రూ. 18.45కోట్లు
- స్పోర్ట్స్ మీట్‌కు అయ్యే ఖర్చు రూ.20 లక్షలు (గతంలో ఇది రూ.2.24 లక్షలు)
- పోలీస్ అమర వీరుల వారోత్సవాలకు రూ. 10 లక్షలు కేటాయించారు. (గతేడాది ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు)
- నూతన పోలీస్ స్టేషన్ల నిర్వహణకు రూ. 5 కోట్లు (గత ఏడాది రూ. 12.54 కోట్లు కేటాయించారు)

రాచకొండలో..


- కమిషనరేట్ నిర్వహణకు రూ. 9.40 కోట్లు
- కార్యాలయ నిర్వహణకు రూ. 7.46 కోట్లు
- ట్రాఫిక్ విభాగానికి రూ. 60 లక్షలు
- పండగల బందోబస్తుకు రూ. 75 లక్షలు
- సీసీఎస్, ఎస్‌వోటీ విభాగాలకు రూ. 5.50 లక్షలు
- మహిళా భద్రతకు రూ. 11.20 లక్షలు
- సీసీటీవీల నిర్వహణకు రూ. 25 లక్షలు
- స్పోర్ట్స్ మీట్‌కు రూ. 3.20 లక్షలు
- రాచకొండ కమిషనరేట్ భవన నిర్మాణానికి రూ. లక్ష

సైబరాబాద్‌లో..

- కమిషనరేట్ నిర్వహణకు రూ. 12.36 కోట్లు
- ట్రాఫిక్ విభాగానికి రూ. 2.65 కోట్లు
- పండగల బందోబస్తుకు రూ. 2.10 కోట్లు
- సీసీఎస్, ఎస్‌వోటీ విభాగాలకు రూ. 1.41 కోట్లు
- మహిళల భద్రతకు రూ. 33 లక్షలు
- స్పోర్ట్స్ మీట్‌కు రూ. 35 లక్షలు

కొత్తగా ఏర్పాటైన పోలీస్ స్టేషన్ల నిర్వహణ, నిర్మాణం, మౌలిక సదుపాయాలకు బడ్జెట్ కేటాయించలేదు.

ఆంగ్ల హాస్య నవల బ్రెయిన్ వెంచర్స్ ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళా జనార్దనమూర్తి, తదితరులు

చిక్కడపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): అమెరికాలో స్థిరపడిన తెలుగు అమ్మాయి గోలి అంజన రచించిన బ్రెయిన్ వెంచర్స్ ఆంగ్ల నవల ఆవిష్కరణ గానసభ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగింది. అధ్యక్షత వహించిన కళా జనార్దనమూర్తి సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. అంజన గతంలో వ్యక్తిత్వ వికాసంపై రాసిన సంపుటి పలువురి ప్రశంసలు పొందిందని వివరించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న హాస్యావధాని జర్నలిస్ట్ శంకరనారాయణ మాట్లాడుతూ హాస్య రచన చేయడం సులువు కాదన్నారు. పాటల రచయిత ఆర్. విశ్వేశ్వరరావు, కళాపోషకులు వడ్లకొండ వెంకటరావులు మాట్లాడుతూ అంజన భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ రచనలు చేయగలరన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు.

చొక్కాపు వెంకటరమణకు వండర్ బుక్ రికార్డ్ ప్రదానం

చిక్కడపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత, వంద నిముషాల్లో వంద కథలు చెప్పి రికార్డు సృష్టించిన మాస్టర్ స్టోరీ టెల్లర్ చొక్కాపు వెంకటరమణకు ఇంటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు రికార్డ్ ధ్రువీకరణ పత్రాన్ని పంపించారు. విద్యారత్న బింగి మల్లీశ్వరి మెమోరియల్ ట్రస్ట్ 35వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన నిర్వహించిన కార్యక్రమంలో వారు పంపిన వండర్ బుక్ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని కేంద్రమాజీ మంత్రి డా. సముద్రాల వేణుగోపాలచారి అందజేసి సత్కరించారు. ఆయన స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్ నేర్పే కథాకేళి కార్డులను భారతదేశంలో తొలిసారిగా రూపొందించారు. అరచేతిలో పట్టే సైజులో 130 స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, 120 పంచ్ దారపలుకులు 78 అరనిమిషం కథలతో 56 కార్డుల డెక్‌ను రూపుదిద్దారు. కార్యక్రమంలో బూర్గుల మధుసూదన్, అశోక్‌కుమార్ హిరావత్, వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, కొరగంటి శ్రీనివాస్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌ను బహూకరిస్తున్న వేణుగోపాలచారి, బింగి నరేందర్‌గౌడ్

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి కృషి



మాట్లాడుతున్న సదాశివ్ సావ్రీకర్

నల్లకుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నిక్షిప్తమైన ప్రతిభను వెలికి తీయడానికి వివేకా వర్ధిని ఎడ్యుకేషన్ సొసైటీ కృషి చేస్తుందని అధ్యక్షుడు సదాశివ్ సావ్రీకర్, చైర్మన్ ప్రకాష్ తుల్జాపుర్కర్‌లు తెలిపారు. గురువారం నల్లకుంట వివేక్ వర్ధిని సంగీత్ మహావిద్యాలయంలో విద్యార్థులచే కచేరి, సితార్, నృత్య ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగీతంలో తబల, సితార్, గిటార్లతోపాటు నృత్యంపై 250 మంది విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి బీఏ, ఎంఏ సమానమైన సర్టిఫికెట్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సువర్ణ నైక్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రమేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ

రూ.లక్ష విలువైన పూజా సామగ్రి రికవరీ

ఇద్దరు మహిళల రిమాండ్

చిక్కడపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇంట్లోనుంచి పూజా సామగ్రి దొంగిలించి పరారైన ఇద్దరు మహిళలను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారివద్ద నుంచి లక్ష రూపాయల విలువైన 1,214 గ్రాముల వెండి పూజా సామగ్రిని రికవరీ చేశారు. గురువారం చిక్కడపల్లి ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. బాగ్‌లింగంపల్లికి చెందిన ప్రతాప్ ఓంకారేశ్వర్ ఈనెల 21న రాత్రి ఇంట్లో తన పూజను ముగించుకుని పూజకు వినియోగించిన వెండి సామగ్రిని వాషింగ్ ఏరియా దగ్గర ఉంచి మరుసటి రోజు చూడగా కనిపించలేదు. కుటుంబ సభ్యులను విచారించినా ఎక్కడా దొరకలేదు. 23న చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ శశిపాల్‌రెడ్డి క్రైమ్ సిబ్బంది సహకారంతో సీసీ ఫుటేజీలు చెక్ చేయడంతోపాటు విచారణ జరుపగా బాగ్‌లింగంపల్లి ప్రాంతానికి చెందిన అక్కచెల్లెళ్లు ఉమ(48), స్వప్న(46)లు చోరీ చేసిన విషయాన్ని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురువారం నాంపల్లి 8వ ఏసీఎంఎం కోర్టులో ప్రవేశపెట్టారు.

జీహెచ్ఎంసీలో ప్రోగ్రామ్ ఆఫీసర్ తొలగింపు

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో లైంగిక వేధింపులకు పాల్పడిన జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్ విభాగంలోని ప్రోగ్రామ్ ఆఫీసర్‌ను విధులను నుంచి తొలగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్ విభాగంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సోమ భరత్ జీహెచ్ఎంసీలో ఓ మహిళా ఉద్యోగిని ప్రేమ పేరుతో వేధించాడు. విసుగు చెందిన బాధితురాలు రెండు వారాల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి భరత్‌ను అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం కమిషనర్ ఆమ్రపాలి దృష్టికి రావడంతో మూడు రోజుల క్రితం భరత్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. సోమ భరత్ తీరు వల్ల ఆ విభాగంలో పనిచేసే దాదాపు 30మంది మహిళలు తమ ఉద్యోగాలు కోల్పోయినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

పెట్టుబడికి అధిక లాభాలిస్తామని వంచన

రూ.6 కోట్లు వసూలు, ఇద్దరు అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడికి అధిక లాభాలు ఆశచూపి రూ.6 కోట్ల వసూలు చేసిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను రాచకొండ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేటకు చెందిన మాధవరం వంశీ కృష్ణారావు (35), కరీంనగర్ జిల్లా రామగుండం చెందిన తాటిపల్లి రాకేష్ (28) తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని భావించారు. తాము సూచించినట్లు పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. ఆసక్తి ఉన్నవారిని 'ఆర్ 7322 టీమ్ హార్వే' పేరుతో టెలిగ్రాం గ్రూపులో యాడ్ చేస్తున్నారు. ఆశావహులకు తొలుత కొంత లాభం వచ్చినట్లు చూపేవారు. డబ్బు తమ ఖాతాల్లో వేయించుకొని యాప్‌లో పెట్టుబడి పెట్టినట్లు చూపేవారు. ఇలా పలువురిని మోసం చేసి సుమారు రూ.6.05 కోట్ల వరకు వసూలు చేశారు. లాభాలు వచ్చినట్లు యాప్‌లో చూపినా, డబ్బు విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడం.. మోసగాళ్లు స్పందించకపోవడంతో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో వంశీకృష్ణారావు, రాకేష్‌లను అరెస్ట్ చేసి వారి ఖాతాల్లో రూ.22.64 లక్షలను ఫ్రీజ్ చేయించారు.

బ్యాంకు శాఖలలో తగిన సిబ్బందిని నియమించాలి



ధర్నా నిర్వహిస్తున్న సిబ్బంది, అధికారులు

బర్కత్‌పుర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్యాంకు శాఖలలో తగిన సిబ్బంది, అధికారులను నియమించాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం లిబర్టీలోని ఇండియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం ముందు ఇండియన్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీసీఎస్) ఆధ్వర్యంలో ఉద్యోగులు ప్లే కార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో క్లరికల్ స్టాఫ్, సబార్డినేట్ స్టాఫ్, స్వీపర్లను తగిన సంఖ్యలో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. వి. కృష్ణారావు, యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్. కుమార్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ జనరల్, జోనల్ మేనేజర్లకు వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్ర బడ్జెట్‌పై భిన్న స్వరాలు



ఎన్నికల హామీలను విస్మరించారు



ముషీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించింది. ప్రతీ మహిళకు రూ.2,500 ఇస్తామని విస్మరించారు. సంవత్సరంలో లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అయినా ఇప్పటికీ ఆ ఊసేలేదు. కొత్త పెన్షన్లు, రేషన్‌కార్డులు ఇస్తామన్న మాట మరిచారు. నగర అభివృద్ధి నిధుల కేటాయింపులోనూ నిర్లక్ష్యం చేశారు.

-ముఠా జైసింహా, బీఆర్ఎస్ యువజన నాయకుడు

బడ్జెట్‌లో లోపించిన సమతుల్యత



పదేళ్ల నియంతృత్వ పాలన నుంచి విముక్తి అయి ప్రజాపాలన ఏర్పాటు చేశామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో కేసీఆర్, రేవంత్‌రెడ్డి పాలనకు ఏ మాత్రం తేడా లేకుండా ఉంది. బడ్జెట్ కేటాయింపుల్లో సమతుల్యత, శాస్త్రీయత, వికేంద్రీకరణ లోపించింది. 50 శాతంపైగా బీసీలకు బడ్జెట్‌లో సరైన ప్రాధాన్యత లేదు. గ్రామీణాభివృద్ధికి నిధులు లేవు. వైద్య, ఆరోగ్య రంగానికి నామమాత్రంగా నిధులు కేటాయించారు. మహిళల సంక్షేమం, ఆటోడ్రైవర్లకు నిధులు లేవు.

- గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శి, ఎం సీపీఐ(యూ)

బీసీలకు తీరని అన్యాయం



రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించలేదు. 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు 9 వేల 200 కోట్లు మాత్రమే కేటాయించి తీరని అన్యాయం చేశారు. బీసీల సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించలేదు. బీసీ కుల సంఘాల కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా వాటిని నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరిగింది. బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు నిధులు సైతం కేటాయించలేదు.

- ఆరే మహేందర్, తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

అన్ని రంగాలకు అంతంత మాత్రమే



విద్యారంగానికి, నిరుద్యోగ నిర్మూలన, యువత ఉపాధి అవకాశాల కల్పనకు బడ్జెట్ కేటాయింపులే లేవు. సీఎం చెప్పిన మాటలకు కేటాయించిన బడ్జెట్‌కు పొంతన లేదు. నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు. వైద్య, ఆరోగ్య రంగానికి అంతంత మాత్రం నిధులు కేటాయించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌కు రేవంత్ రెడ్డి బడ్జెట్ రెండూ ఒకే రకంగా ఉన్నాయి. అసలు కొత్త దనమే లేదు.

-సూర్యనారాయణశర్మ, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి: రాష్ట్ర బడ్జెట్‌లో గ్రేటర్‌కు మొండి చేయి చూపారని బర్కత్‌పుర చౌరస్తాలో బీజేపీ నేతలు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, నాయకులు జి. ఆనంద్‌గౌడ్, కన్నె రమేష్‌యాదవ్, సూర్యప్రకాష్‌సింగ్, సి. కృష్ణగౌడ్, ఎక్కాల కన్నా, సుభాష్‌పటేల్‌గౌడ్, శ్యామ్‌రాజ్ పాల్గొన్నారు.



చిక్కడపల్లికి చెందిన బి. రాజుకు శస్త్ర చికిత్స కోసం రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ మంజూరు చేయించిన రూ. 2 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్ గురువారం అందజేశారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

పండిట్ అంజుబాబుకు డాక్టరేట్ ప్రదానం



పట్టా అందుకుటున్న డాక్టర్ అంజుబాబు

చిక్కడపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): దేశం నుంచి వివిధ రంగాల్లో దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న ప్రముఖులను గుర్తించి గౌరవ డాక్టరేట్, యూనివర్శిటీ మెడల్ ప్రదానం చేసి అభినందించారు. కథక్ నాట్యరంగంలో ఐదు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న అశోక్‌నగర్‌కు చెందిన నాట్య గురు పండిట్ ఎర్రంశెట్టి అంజుబాబు డాక్టరేట్, గోల్డ్‌మెడల్‌ను అందుకున్నారు. బుధవారం న్యూఢిల్లీలోని హోటల్ సామ్రాట్‌లో జరిగిన అమెరికా మేరీల్యాండ్‌కు చెందిన సౌత్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్శిటీ స్నాతకోత్సవంలో ఆయనను గౌరవించారు. ముఖ్యఅతిథిగా డా. జానీస్ మార్ఫీయ హాజరయ్యారు. కార్యక్రమంలో గజల్ గాయని పద్మశ్రీ షెనాజ్ మసానీ, జర్నలిస్ట్ అభిషేక్ పాల్గొన్నారు.